MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక



ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 201 | గురువారం 26 నవంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-

తొలి విడత పంచాయతీ పోరు

రక్తమోడిన గ్రామాలు

నంద్యాలలో ఎమ్మెల్యే వాహనంపై దాడి

(అంకుశం, అమరావతి, నవంబర్ 26): మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉద్రిక్తతల మధ్య ముగిశాయి. 3,949 పంచాయతీలకు నోటిఫికేషన్ జారీ చేయగా ఇందులో 760 చోట్ల సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం 3,189 పంచాయతీలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరిగింది. ఎన్నికల సందర్భంగా పలుచోట్ల ఘర్షణలు చోటు చేసుకున్నాయి. నంద్యాల జిల్లా అహోబిలంలో పోలింగ్ పర్యవేక్షణకు వెళు ్న ఆళ్లగడ్డ టీడీపీ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ వాహనంపై ప్రత్యర్థివర్గం వారు దాడి చేశారు. ఈ ఘటనలో ఎమ్మెల్యే కారు అద్దాలు ధ్వంసం కాగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యా యి. అల్లగడ్డ మండలం జంబులదిన్నెలో రిగ్గింగ్ చేస్తున్నారనే ఆరోపణలతో ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు కారం చల్లుకోవడంతో ఆ బూత్‌లో పోలింగ్ తాత్కాలికంగా నిలిపివేసి ఆ తర్వాత ఎన్నిక నిర్వహించారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి పోలింగ్ బూత్ వద్ద టీడీపీ మద్దతుదారులకు, పార్టీ రెబల్స్‌కు మధ్య వివాదం చెలరేగింది. ఓటర్లు, పార్టీ కార్యకర్తల మధ్య కొంతసేపు గందరగోళం నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పల్నాడు జిల్లా ఈపూరు మండలం కొండ్రుముట్ల గ్రామంలో బ్యాలెట్ బాక్సు పగులగొట్టేందుకు కొందరు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.







సేవలోనే నిజమైన ఆనందం

పేదల సంక్షేమం, ఆధ్యాత్మిక సేవకు ధనవంతులు ముందుకు రావాలి

శ్రీకృష్ణదేవరాయలు నుంచి జైన్ దంపతుల వరకు భక్తి పరంపర కొనసాగుతోంది

చెన్నైకు చెందిన జైన్ దంపతులతో కలిసి తిరుమలలో నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి

శ్రీవారికి రూ.206 కోట్ల విలువైన 121 కిలోల బంగారు, వజ్రాభరణాల సమర్పణ

కార్యక్రమంలో పాల్గొన్న సీఎం అపూర్వ దాతృత్వం చాటిన వర్ధమాన్ జైన్ దంపతులపై సీఎం చంద్రబాబు ప్రశంసల జల్లు















అంకుశం న్యూస్ తిరుమల నవంబర్ 26

డబ్బు, సంపద, హోదా ఎప్పటికీ శాశ్వతం కాదు.. ఆధ్యాత్మికత, ధర్మం, సేవా భావమే మనిషికి అసలైన సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచంలో ఎంతోమంది బిలియనీర్లు, ట్రిలియనీర్లు ఉన్నారని... కానీ సంపాదించిన సంపదను సద్వినియోగం చేసుకునే అదృష్టం కొందరికే దక్కుతుందన్నారు. ఆ కోవలోనే నిలిచి తమ దాతృత్వాన్ని చాటుకున్న చెన్నైకు చెందిన వర్ధమాన్ జైన్, రాధికా జైన్ దంపతులు అందరికీ ఆదర్శంగా ఉన్నారని సీఎం చంద్రబాబు కొనియాడారు - మిగతా2లో

రాజకీయ పార్టీల మీడియా.. ప్రజాస్వామ్యానికి పెను సవాలు

మీడియా యాజమాన్యంలో పారదర్శకత కావాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

(అంకుశం, అమరావతి, నవంబర్ 26):

రాజకీయ పార్టీల మీడియా ప్రజాస్వామ్యానికి పెను సవాలుగా మారిందని పలువురు వక్తలు వెల్లడించారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'మీడియా యాజమాన్యాలు, ప్రయోజనాల వైరుధ్యం, పర్యవసానాలపై' నిర్వహించిన ఈ సమావేశానికి అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్‌అధ్యక్షత వహించారు. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ముఖ్య అతిథిగా పాల్గొనగా, వివిధ కమిషన్ల చైర్‌పర్సన్‌లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సీనియర్ న్యాయవాది, సీనియర్ జర్నలిస్ట్‌లు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసార ధి మాట్లాడుతూ.. నాలుగో స్తంభమైన మీడియా సామాజిక బాధ్యతతో వ్యవహరించి సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను పునర్వ్యవస్థీకరించి కఠిన నియమ నిబంధనలు రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మీడియా యాజమాన్యంలో పారదర్శకత కావాలి. రాజకీయ ప్రత్యర్థులు శత్రువులు కాదని, పార్టీలకు అతీతంగా మానవ సంబంధాలు, పరస్పర గౌరవం నిలబడాలని చెబుతూ, మహిళలను కించపరిచే అసభ్యకర భాషను వాడటం, ప్రచురించడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని ఆవేదన వ్యక్తం చేశారు. - మిగతా2లో

తిరుమల వెంకన్నకు రూ.207.60 కోట్ల విలువైన

121 కిలోల బంగారు ఆభరణాల విరాళం

46 ఆభరణాలను సమర్పించిన చెన్నైకి చెందిన వర్ధమాన్ జైన్, రాధికా జైన్ దంపతులు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆభరణాల సమర్పణ



రాజకీయ పార్టీల మీడియా.. ప్రజాస్వామ్యానికి పెను సవాలు

-మొదటిపేజీ తరువాయి

సి.ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు, రాజకీయ కుటుంబాలు సొంతంగా పత్రికలు, న్యూస్ ఛానల్స్ నడపడం ప్రజా ప్రయోజనాలకు, ప్రజాస్వామ్య మనుగడకు అత్యంత హానికరమని స్పష్టం చేశారు. చట్టాల కంటే సమాజంలో విస్తృత చర్చ జరిగి, బలమైన పౌర సమాజం, ఉత్ప్రేరక శక్తుల ద్వారా ప్రజలే స్వచ్ఛందంగా పక్షపాత మీడియాను తిరస్కరించేలా చైతన్యం రావాలన్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ పోతుల బాలకోటయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో మీడియా వ్యవస్థ నిలువునా చీలిపోయిందని, రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేస్తూ రాజకీయ పార్టీల అధినేతల సొంత మీడియా సంస్థలు ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేస్తున్నాయని పేర్కొన్నారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మీడియా సంస్థలను నడుపుతూ ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తున్నాయని, మహిళల వ్యక్తిగత జీవితాలు, గౌరవంపై అభ్యంతరకర రాతలు, డిబేట్లు పెరగడం ప్రజాస్వామ్యానికి పెను సవాలుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

శ్రీకృష్ణదేవరాయల నాటి భక్తి పరంపర మళ్లీ చూస్తున్నాం

-మొదటిపేజీ తరువాయి

ఇతర ధనవంతులు కూడా ముందుకొచ్చి పేదల సంక్షేమానికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో టీటీడీ సహకారంతో 5 వేల ఆలయాలు నిర్మించడంతో పాటు, దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో, విదేశాల్లో హిందువులు అధికంగా ఉండే ప్రాంతాల్లో శ్రీవారి దేవాలయాలను, అన్నప్రసాద కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. తిరుమలకు నీటి కొరత లేకుండా హంద్రీ-నీవా ద్వారా కల్యాణి డ్యామ్‌కు, సోమశిల ద్వారా బాలాజీ రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తామని, అవసరమైతే రెండో పైప్‌లైన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలిపిరి దాడి సమయంలో శ్రీవారే తనకు ప్రాణభిక్ష పెట్టి పునర్జన్మ ప్రసాదించారని ఈ సందర్భంగా సీఎం భావోద్వేగంతో గుర్తు చేసుకున్నారు.

హైదరాబాద్‌లో పెరిగిన అమ్ముడుపోని ఇళ్లు: 7 శాతం వృద్ధి

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో అమ్మకాలు కాస్త మందగించగా, కొత్త ప్రాజెక్టుల రాకతో అమ్ముడుపోని ఇళ్ల (అన్‌సోల్డ్ ఇన్వెంటరీ) సంఖ్య పెరిగింది. 2026 మూడో త్రైమాసికంలో నగరంలో అమ్ముడుపోని నివాస గృహాల ఇన్వెంటరీ 7 శాతం మేర పెరిగినట్లు ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ 'నైట్ ఫ్రాంక్ ఇండియా' నివేదిక వెల్లడించింది. మార్కెట్ డిమాండ్‌ను మించి సరికొత్త ప్రాజెక్టులు ప్రారంభం కావడమే ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. గత ఏడాదితో పోలిస్తే ఇళ్ల సగటు అమ్మకాల్లో కేవలం 3 శాతం మాత్రమే వృద్ధి నమోదు కాగా.. మార్కెట్లోకి కొత్త సప్లై వేగంగా పెరగడం వల్ల నిల్వలు పేరుకుపోయాయి. దీనివల్ల హైదరాబాద్‌లో ఇళ్ల విక్రయాల వ్యవధి కూడా పెరిగింది. గత ఎనిమిది త్రైమాసికాల సగటు అమ్మకాల వేగాన్ని బట్టి ప్రస్తుత ఇన్వెంటరీ అమ్ముడవడానికి పట్టే సమయాన్ని క్యూటీఎస్ కొలుస్తుంది. 2025 మూడో త్రైమాసికంలో 5.8 త్రైమాసికాలు (1.45 సంవత్సరాలు)గా ఉన్న ఈ వ్యవధి, 2026 మూడో త్రైమాసికం నాటికి 6.1 త్రైమాసికాలు (1.52 సంవత్సరాలు)కు చేరింది. దేశవ్యాప్తంగా అగ్రశ్రేణి ఎనిమిది ప్రధాన నగరాల సగటును పరిశీలిస్తే, గత ఏడాది 5.8 త్రైమాసికాలుగా ఉన్న కనిష్ఠ స్థాయి నుంచి ఈసారి 6.1 త్రైమాసికాలకు పెరిగింది. అయితే 2018 నుంచి 2021 మధ్య నమోదైన 7 నుంచి 11 త్రైమాసికాలతో పోలిస్తే ప్రస్తుత వ్యవధి చాలా మెరుగ్గా ఉందని నివేదిక పేర్కొంది. ఎన్‌సీఆర్, అహ్మదాబాద్ వంటి నగరాల్లో అమ్మకాల వ్యవధి కాస్త ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఇతర ప్రధాన నగరాల్లో మార్కెట్ పునాదులు ఇప్పటికీ పటిష్ఠంగానే ఉన్నాయని నైట్ ఫ్రాంక్ ప్రతినిధి గులాం జియా తెలిపారు.

సైబరాబాద్ సీపీ రమేశ్ రెడ్డి, మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డికి జైలు శిక్ష విధించిన హైకోర్టు

కోర్టు ధిక్కరణ కేసులో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేశ్ రెడ్డి, మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డిలకు తెలంగాణ హైకోర్టు షాకిచ్చింది. న్యాయస్థానం ఆదేశాలను బేఖాతరు చేసినందుకు గాను ఇద్దరు సీనియర్ పోలీస్ అధికారులకు రెండు వారాల సాధారణ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 2,000 చొప్పున జరిమానా విధించింది. ఒకవేళ జరిమానా చెల్లించకపోతే అదనంగా మరో వారం రోజుల పాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. గతంలో ఒక భూ వివాదానికి సంబంధించిన కేసులో పిటిషనర్‌కు పోలీస్ రక్షణ కల్పించాలంటూ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆ ఉత్తర్వులను ఉన్నతాధికారులు అమలు చేయకపోవడంతో బాధితుడు హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం, కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగానే ఉల్లంఘించారని నిర్ధారిస్తూ రమేశ్ రెడ్డి, కోటిరెడ్డిలను దోషులుగా తేల్చి ఈ శిక్షను ఖరారు చేసింది. అయితే, ఈ తీర్పుపై ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేసుకునేందుకు వీలుగా జైలు శిక్ష అమలును హైకోర్టు వారం రోజుల పాటు నిలిపివేసింది. ఈ వారం రోజుల వ్యవధిలో ఉన్నత బెంచ్ నుంచి ఎలాంటి స్టే ఉత్తర్వులు తెచ్చుకోలేకపోతే, వెంటనే హైకోర్టు రిజిస్ట్రార్ ఎదుట లొంగిపోయి జైలు శిక్షను అనుభవించాలని స్పష్టం చేసింది.

మంగళగిరిలో ఓటు హక్కు వినియోగించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తొలి దశ స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా, కొత్తగా ఏర్పాటైన మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆయన ఓటు వేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎంఎస్ఎస్ నగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 34/3 నంబర్ పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పవన్, సామాన్య ఓటరులా క్యూలైన్‌లో నిల్చొని తన ఓటు వేశారు. ఆయన రాకతో పోలింగ్ కేంద్రం వద్దకు పెద్ద సంఖ్యలో జనసేన కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు తరలివచ్చారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఓటు వేసిన అనంతరం పవన్ కల్యాణ్ తన వేలికి ఉన్న సిరా గుర్తును మీడియాకు చూపించారు. రాష్ట్ర రాజధాని అమరావతికి ముఖద్వారంగా ఉన్న మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. నేడు రాష్ట్రవ్యాప్తంగా పలు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు మొదటి విడత పోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే.

రాయలసీమ లిఫ్ట్ పేరుతో రూ.1000 కోట్ల దోపిడీ: జగన్‌పై మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి నిప్పులు!

రాయలసీమ ప్రాజెక్టులు, రైతుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఏమాత్రం లేదని తెలుగుదేశం పార్టీ పులివెందుల ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయలసీమకు తీరని ద్రోహం చేసిన జగన్, ఇప్పుడు నీచ రాజకీయాల కోసమే సీమ పేరును వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ఘాటైన ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీనీవా పనులను వేగవంతం చేసి, రాయలసీమ చిట్టచివరి ఆయకట్టు వరకు కృష్ణా జలాలను పారిస్తుంటే పొరుగు రాష్ట్రాల నేతలు సైతం ప్రశంసిస్తున్నారని, ఇది చూసి ఓర్వలేక జగన్ కడుపుమంటతో రగిలిపోతున్నారని ఎద్దేవా చేశారు. 2020లోనే హెచ్చరించి రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగంగానే చెప్పారని, దీనికి జగన్ ఏం సమాధానం చెబుతారని నిలదీశారు.

సేవలోనే నిజమైన ఆనందం

-మొదటిపేజీ తరువాయి

. గురువారం తిరుమల శ్రీవారికి చెన్నైకు చెందిన జైన్ దంపతులు రూ.206 కోట్ల విలువైన 121 కిలోల బంగారు, వజ్రాభరణాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సతీసమేతంగా పాల్గొన్నారు. టీటీడీ అర్చకులు, అధికారులు ఈ ఆభరణాలను స్వీకరించారు. అనంతరం ధాతలైన జైన్ దంపతులతో కలిసి సీఎం తిరుమలలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... తిరుమల పవిత్ర క్షేత్రంలో ఒక అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైందని, ఇందులో తాను భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రతిరోజూ శ్రీవారికి 120 కిలోల బంగారు ఆభరణాలు అలంకరిస్తారని, దేవుని ఆదేశంతోనే 121 కిలోల బంగారు, వజ్రాభరణాలను సమర్పించామని జైన్ దంపతులు చెప్పడం వారి భక్తికి నిదర్శనమన్నారు. పూర్వం పల్లవ, చోళ, చేర, పాండ్య రాజులతో పాటు మైసూర్, మరాఠా రాజులు ఆలయాన్ని అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు శ్రీవారికి రత్నకిరీటం, పీతాంబరం సహా ఎన్నో ఆభరణాలు సమర్పించారని, ఆనాటి శ్రీకృష్ణ దేవరాయల కాలం నుంచి నేటి జైన్ దంపతుల వరకు స్వామివారిపై భక్తి విశ్వాసాలు పెరుగుతూనే ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు.



మానవ సేవే... మాధవ సేవ

దేవునిపై భక్తి ఉన్న ప్రతి ఒక్కరూ మానవ సేవే – మాధవ సేవ అనే సూత్రాన్ని గుర్తుంచుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. సమాజ హితం కోసం పనిచేసే వారే దేవునికి అత్యంత సన్నిహితంగా ఉంటారన్నారు. జైన్ దంపతుల తరహాలోనే ఇతర సంపన్నులు కూడా ముందుకు వచ్చి పేదల సంక్షేమం, సమాజ సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. భక్తులు సమర్పించే ప్రతి రూపాయిని టీటీడీ వారి సౌకర్యాలు, సేవలకే ఖర్చు చేస్తోందన్నారు. రాష్ట్రంలో టీటీడీ సహకారంతో 5 వేల దేవాలయాల నిర్మాణం చేపట్టబోతున్నామని, దేశంలోని అన్ని రాజధానులతో పాటు విదేశాల్లో హిందువులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని వెల్లడించారు. ఆలయం ఉన్న ప్రతిచోటా అన్నప్రసాదం ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే, 'ప్రాణదానం' ద్వారా వైద్య సేవలు, 'విద్యాదానం' కింద ప్రత్యేక నిధితో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తామని తెలిపారు. ఎల్ నినో వంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా 'వృక్షో గోవిందం' పేరుతో పచ్చదనం పెంపు కార్యక్రమాలు చేపడతామన్నారు. భవిష్యత్తులో తిరుమలకు నీటి ఎద్దడి అనే మాటే లేకుండా హంద్రీ-నీవా ద్వారా కళ్యాణి డ్యాంకు, సోమశిల ద్వారా బాలాజీ రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తామని, అవసరమైతే తిరుమలకు రెండో పైప్ లైన్ కూడా వేస్తామని స్పష్టం చేశారు. టెక్నాలజీ, నాలెడ్జ్‌తో పాటు భగవంతుని కృప ఉండటం వల్లే రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, శ్రీవారి ఆశీస్సులతో రాష్ట్రం, దేశం మరింత అభివృద్ధి చెందడం ఖాయమని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

నమ్ముకున్న వారికి శ్రీవారి అండ... రక్షణ

పూర్వ కాలంలో దేవాలయాల మీద చాలా దాడులు జరిగాయి... కానీ వెంకటేశ్వరస్వామి దేవాలయం విషయంలో ఎవ్వరూ ఆ సాహసానికి ఒడిగట్టలేదని ముఖ్యమంత్రి అన్నారు. రోజు రోజుకూ శ్రీవారి భక్తుల విశ్వాసాన్ని పెంపొందించడానికి చాలా మంది కృషి చేశారని చెప్పారు. కొలిచిన వారికి, నమ్మిన వారికి శ్రీవారు రక్షణగా నిలిచారని... అది తన విషయంలో నిరూపితమైందన్నారు. ప్రాణదానం కార్యక్రమాన్ని ప్రారంభించిన రోజే నాపై అలిపిరిలో దాడి జరిగిందని... చాలా పకడ్బందీగా నాపై దాడి జరిగినా... స్వామి కృప వల్లే ఆ దాడిలో ఎవ్వరూ చనిపోలేదని చెప్పారు. వెంకటేశ్వర స్వామే ప్రాణభిక్ష పెట్టారని... పునర్జన్మనిచ్చారంటూ సీఎం భావోద్వేగంతో నాటి సంఘటనను గుర్తుచేసుకున్నారు. ప్రపంచం మొత్తంగా ఉన్న శ్రీవారి భక్తుల్లో విశ్వాసం పెంపొందించేలా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. భక్తుల విరాళాలు, ఆదాయాన్ని వెల్లడించడం, భక్తులు ఇచ్చిన విరాళాలను వారి సౌకర్యాలు.. సేవలకే ఖర్చు పెడుతున్నారని తెలిపారు. తిరుమల కొండపై పచ్చదనం విరాజిల్లుతోందని... దేవుని పవిత్రత కాపాడే విషయంలో రాజీ పడవద్దని టీటీడీకి విజ్ఞప్తి చేశారు. గో-సంరక్షణ, వేద పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని... దీనికి టీటీడీ నాందీ పలకాలన్నారు. శ్రీవారి దేవాలయాన్ని ఆదర్శంగా... పవిత్రతకు మారుపేరుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించారు. శ్రీవారి సేవకులు చాలా భక్తి విశ్వాసంతో సేవలు అందిస్తున్నారని... వారిని మరింత ప్రోత్సహించాలన్నారు. ఎక్కడికక్కడ శ్రీవారి దేవాలయాలను నిర్మించాలి... ఆ దేవాలయాల్లో ప్రశాంత, పవిత్ర వాతావరణం ఉండేలా చూడాలని నిర్దేశించారు. దేశంలోని అన్ని రాజధానుల్లో శ్రీవారి దేవాలయాలను నిర్మిస్తామని... విదేశాల్లో కూడా హిందువులు ఎక్కువగా ఉన్న చోట వెంకటేశ్వర స్వామి దేవాలయాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో దాతలు వర్ధమాన్ జైన్ దంపతులు ,టీటీడీ స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్ మరియు టీటీడీ ఈఓ ముద్దాడ రవి చంద్ర , అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, జిల్లా కలెక్టర్ డా. ఎస్ వేంకటేశ్వర్, జేఈవోలు డా.ఎ.శరత్, ప్రభల గోపీనాథ్, సివిఎస్వో కేవీ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు తదితర పాల్గొన్నారు

తిరుమల వెంకన్నకు రూ.207.60 కోట్ల విలువైన

121 కిలోల బంగారు ఆభరణాల విరాళం

అంకుశం న్యూస్ తిరుమల నవంబర్ 26

తిరుమల శ్రీవారి చరిత్రలో చారిత్రాత్మక విరాళంగా నిలిచేలా చెన్నైకి చెందిన దాతలు శ్రీ వర్ధమాన్ జైన్, శ్రీమతి రాధికా జైన్ దంపతులు రూ.207.60 కోట్ల విలువైన 121 కిలోల బంగారు ఆభరణాలను గురువారం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఈ విరాళం సమర్పించారు.



శ్రీవారి దర్శనం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దాత దంపతులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి రంగనాయకుల మండపంలో ప్రదర్శించిన 46 బంగారు ఆభరణాలను వీక్షించి, దాతల ఉదారతను అభినందించారు.

అనంతరం దాత కుటుంబ సభ్యులు ఒక్కొక్కరు తలపై ఆభరణాల పళ్లెంలను ధరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, శ్రీవారి సన్నిధికి చేరుకుని ఆభరణాలను స్వామివారి ఎదుట సమర్పించి పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో టీటీడీ సాధికార మండలి చైర్మన్, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవోలు డా. శరత్, గోపీనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణ పాల్గొన్నారు. జిల్లా అధికారుల్లో కలెక్టర్ డా. వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాల వివరాలు

- మొత్తం బంగారం: 121 కిలోలు (24 క్యారెట్లు)
- మొత్తం ఆభరణాలు: 46
- ఆభరణాల రకాలు: 33
- ఆభరణాల తయారీ ఖర్చులతో కలిపి మొత్తం విలువ: రూ.207.60 కోట్లు
- శ్రీవారి ఆభరణాలకు వినియోగించిన బంగారం: 106 కిలోలు (24 క్యారెట్లు)
- మిగిలిన 15 కిలోల బంగారంతో తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి స్వర్ణ వస్త్రం తయారు చేయనున్నారు.

విలువైన రాళ్ల వివరాలు

- వజ్రాల మొత్తం బరువు: 238.2 క్యారెట్లు
- నీలమణులు: 2,247.7 క్యారెట్ల- పసుపు నీలమణులు: 91.6 క్యారెట్లుకెంపులు, పచ్చలు 84.2 క్యారెట్లుసాలగ్రామ రాళ్లు : 2,916.5 గ్రాములు.

విరాళంగా సమర్పించిన 33 రకాల ఆభరణాల వివరాలు

పాద కవచములు -- 2
అందెలు -- పాగడ -- 1
తులసిపత్ర హారము -- 1
అష్టోత్తర శత కాసుల మాల -- 1 చతుర్భుజ లక్ష్మీ హారము -- 1
పులిగోరు -- 1 అష్టోత్తర పత్ర హారము -- 1 సాదా వడ్డాణము -- 1 గంటల ముల్రాడు -- 1
సూర్య కంఠి -- 1 కౌస్తుభం -- 1 శ్రీవత్సం -- 1 మొలచేయి -- 1
కటి హస్తము పై రేకు -- 1
నాగాభరణ వడ్డాణము -- 1. గొలుసు -- 1
అభయ చేతుల కంకణాలు -- 5 చంద్ర వంక కంఠి -- 1
వైకుంఠ హస్తము -- 1. కరి హస్తము -- 1నాగాభరణ కడియములు -- 2 నాగాభరణములు -- 2భుజకీర్తులు -- 2
కర్ణ పత్రములు -- 2 బాహువులు -- 2శాలిగ్రామ హారము -- 2 (2 భాగాలు) కమలం త్రపు శాలిగ్రామ హారములు -- 2 (2 భాగాలు)నీమ కవచముల మోపుగల యజ్ఞోపవీతం -- 1 శంఖము కవచము -- 1
చక్రము కవచము -- 1
ముక్కుపుడి -- 1. కిరీటము -- 1

ఎంత వాడారన్నది కాదు.. ఎప్పుడు వాడారన్నదే లెక్క

ఇంట్లో ఏసీ, వాషింగ్ మెషీన్, గీజర్ వంటివి ఎప్పుడు పడితే అప్పుడు వాడుతున్నారా? ఇకపై అలా చేస్తే కరెంట్ బిల్లు తడిసి మోపెడయ్యే అవకాశం ఉంది. ఒకే పరిమాణంలో విద్యుత్ వాడినా, వాడే సమయాన్ని బట్టి వేర్వేరు బిల్లులు చెల్లించాల్సి వచ్చే సరికొత్త విధానానికి కేంద్ర విద్యుత్ శాఖ రంగం సిద్ధం చేస్తోంది. డిమాండ్ ఎక్కువగా ఉండే వేళల్లో అధిక ధరలు, డిమాండ్ తక్కువగా ఉండే సమయాల్లో తక్కువ ఛార్జీలు వసూలు చేసే 'టైమ్ ఆఫ్ డే' టారిఫ్ ముసాయిదా నిబంధనలను కేంద్రం ప్రతిపాదించింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం.. 2027 ఏప్రిల్ 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. తొలుత 10 కిలోవాట్లకు పైగా డిమాండ్ ఉన్న కస్టమర్లకు 2028 ఏప్రిల్ 1 నాటికి ఈ విధానం వర్తిస్తుంది. ఆ తర్వాత సామాన్య గృహ వినియోగదారులకు 2029 ఏప్రిల్ 1 నుంచి పూర్తిస్థాయిలో అమలవుతుంది. అయితే, రైతులకు ఊరటనిస్తూ వ్యవసాయ రంగానికి దీని నుంచి మినహాయింపు కల్పించారు. రాష్ట్రాల్లోని డిమాండ్, పునరుత్పాదక ఇంధన లభ్యత, పవర్ ఎక్స్ఛేంజ్ ధరలను బట్టి రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండళ్లు వివిధ సమయాల స్లాట్లను, వాటి రేట్లను ఖరారు చేస్తాయి. సౌర విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధనాన్ని సొంతంగా ఉత్పత్తి చేసే 10 కిలోవాట్లకు పైబడిన కస్టమర్లు.. రోజువారీ ఉత్పత్తిలో కనీసం 20 శాతం నిల్వ చేసేలా స్టోరేజీ బ్యాటరీలను తప్పనిసరి చేసే అవకాశం ఉంది. ఈ నిబంధన 2028 ఏప్రిల్ నుంచి అమలు కానుంది. కొత్త కనెక్షన్ల మంజూరుకు కూడా గడువులు విధించారు.



మెట్రోపాలిటన్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాల్లో దరఖాస్తు చేసుకున్న 3 రోజుల్లోనే కొత్త కనెక్షన్ ఇవ్వాలి. ఇతర పురపాలక సంఘాల్లో 7 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 15 రోజులు, కొండ ప్రాంతాల్లో 30 రోజుల గడువు నిర్దేశించారు. లైన్లు వేయడం, సబ్‌స్టేషన్ల నిర్మాణం వంటి పనులుంటే 90 రోజుల సమయం పడుతుంది. విద్యుత్ బిల్లుల అక్రమాలను అరికట్టేందుకు ముసాయిదాలో కీలక రక్షణలు చేర్చారు. గత ఆరు నెలల సగటు కంటే బిల్లు 5 రెట్లు అధికంగా వచ్చినా, లేదా అయిదో వంతు కంటే తక్కువగా నమోదైనా బిల్లింగ్ సిస్టమ్ దాన్ని అనుమానాస్పదంగా గుర్తించాలి. అలా గుర్తించిన కేసులను అధికారులు 30 రోజుల్లోగా పరిష్కరించాలి. ఈ లోపు సదరు సమస్య తేలే వరకు కస్టమర్లు తమ గత ఆరు నెలల సగటు బిల్లును చెల్లించి విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా చూసుకోవచ్చు.

కనగానపల్లె పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలన

నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించాలని అధికారులకు ఆదేశం

అంకుశం న్యూస్ ధర్మవరం,నవంబర్ 26: తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ ప్రక్రియను అత్యంత సజావుగా, పారదర్శకంగా మరియు శాంతియుతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేసింది. ఇందులో భాగంగా గురువారం నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ కనగానపల్లె మండల పరిధిలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా జాయింట్ కలెక్టర్ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు కల్పించిన కనీస మౌలిక సదుపాయాలను నిశితంగా పరిశీలించారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి వసతి, విద్యుత్ సరఫరా, నిరంతరాయంగా పనిచేసే లైటింగ్, దివ్యాంగులు మరియు వృద్ధులు సులభంగా లోపలికి వెళ్లేందుకు వీలుగా ర్యాంప్‌ల ఏర్పాటు, నీడ కోసం టెంట్ల వంటి ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. బ్యాలెట్ బాక్సుల భద్రత, పోలింగ్ కంపార్ట్‌మెంట్ల అమరిక మరియు ఓటర్ల క్యూ లైన్ల నిర్వహణపై క్షేత్రస్థాయి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్





మాట్లాడుతూ... ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమావళిని తూచా తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా తమ బాధ్యతలు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. సున్నితమైన మరియు అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓటర్లందరూ ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కనగానపల్లి తహశీల్దార్ మనోజ్,మండల స్థాయి రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది మరియు ఎన్నికల నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరంలో సీఐటీయూ ర్యాలీ



అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 26 డిసెంబరు ఒకటి నుండి మూడో తేదీ వరకు సిఐటియు ఆధ్వర్యంలో, కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్ ను రద్దుచేసి, వేతనాల పెంపు తదితర డిమాండ్ల సాధనకై, హలో కార్మిక చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అయూబ్ ఖాన్ పిలుపునివ్వడం జరిగింది డిసెంబర్ 1 2 3 ఢిల్లీ ముట్టడి కార్యక్రమానికి సంబంధించి ప్రచారంలో భాగంగా సిఐటియు జిల్లాకమిటీ పిలుపుమేరకు ఈరోజు ధర్మవరం పట్టణంలోని స్థానిక సిఐటియు కార్యాలయం నుండి ఆర్టీసీ బస్టాండ్, కాలేజ్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్,్రా సర్కిల్, గాంధీనగర్ సర్కిల్, అంజుమాన్ సర్కిల్ మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. మునిసిపల్ రెగ్యులర్ కార్మిక సంఘం అధ్యక్షుడు శ్రీరాములు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించడం జరిగింది

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, అయూబ్ ఖాన్, మాట్లాడుతూ

కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దుచేసి, కార్మికులకు కనీస వేతనం 42000/-రూ అమలు చేయాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, డిసెంబర్ ఒకటి నుండి మూడో తేదీ వరకు ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరిగే కార్యక్రమంలో కార్మికులు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కో కన్వీనర్ .రఫీ, ఎన్సిపల్ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు మేకలబాబు, బి,నాగరాజు, కోశాధికారి ఎం,నాగభూషణ, రెగ్యులర్ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు నాగరాజు, ఓబులప్పా, చెన్నకేశవులు,శీనా, బాలమురళి, గజ్జల సూర్యనారాయణ, రమేష్, నారాయణస్వామి, మారుతి, పాల్గొనడం జరిగింది...

రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ కాపాడాలి.

శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి కలెక్టరేట్‌లో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



అంకుశం న్యూస్ పుట్టపర్తి, నవంబర్ 26: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పుట్టపర్తిలోని జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మన దేశానిదని, దేశ పౌరులందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛను కల్పించిన మహోన్నత గ్రంథం భారత రాజ్యాంగమని కొనియాడారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించాలని సూచించారు. ప్రతి పౌరుడు తమ హక్కులతో పాటు ప్రాథమిక విధులను కూడా బాధ్యతాయుతంగా నిర్వర్తించినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది అందరూ భారత రాజ్యాంగ పీఠికను సామూహికంగా పఠించి, ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కొండయ్య, ఎస్‌డిసి విజయ కుమారి,ఎస్‌డిసి మహబూబ్ భాష,వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలనా అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ అవగాహన సదస్సు లో భాగంగా చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ముఖ్య అతిథిగా జూనియర్ సివిల్ జడ్జి ఎం .వంశీ కృష్ణ

తూర్పుగోదావరి



జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 26: అనపర్తి జూనియర్ సివిల్ కోర్టు ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు లో భాగంగా ఈరోజు లా డే మరియు రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని వాటి మీద విద్యార్థులకు చట్టాల మీద అవగాహన కార్యక్రమం లక్ష్మి నరసాపురం గురుకాల పాఠశాల లో జరిగింది. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎం .వంశీ కృష్ణ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కే.శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ రమణమూర్తి అడ్వకేట్ నల్లమిల్లి వినూరెడ్డి , నల్లమిల్లి ధర్మారెడ్డి కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ పాల్గొన్నారు..

తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్



అంకుశం న్యూస్ ధర్మవరం,నవంబర్ 26: జిల్లా వ్యాప్తంగా తొలి విడత గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ అత్యంత ప్రశాంతంగా, పారదర్శకంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఏ. శ్యామ్ ప్రసాద్ గురువారం ఉదయం కనుముక్కల మరియు బసంపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల క్యూలైన్లను, ఓటింగ్ జరుగుతున్న తీరును కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. విధుల్లో ఉన్న ప్రిసైడింగ్ అధికారులు (ూూ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ూూూ) మరియు ఇతర పోలింగ్ సిబ్బందితో మాట్లాడి, పోలింగ్ శాతం వివరాలను అడిగి తెలుసుకున్నారు. బ్యాలెట్ బాక్సుల భద్రత, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు మరియు పోలీసు బందోబస్తును పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూ.చ. తప్పకుండా పాటించాలని, ఏదైనా సాంకేతిక లేదా ఇతర సమస్యలు తలెత్తితే తక్షణమే జోనల్ అధికారులు మరియు కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ...

ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు, భయభ్రాంతులకు లోనుకాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటు వేయాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ తనిఖీలలో జోనల్ అధికారులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మండల కార్యాలయంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



కాకినాడ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 26: భారత రాజ్యాంగ దినోత్సవం (సంవిధాన్ దివస్) ను పెదపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ పరిషత్ రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజుకు గుర్తుగా ప్రతి ఏటా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాజ్యాంగం అందించిన హక్కులు, బాధ్యతల గురించి వివరించారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె. నరేంద్రరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ ఎం.ఎస్.ఎన్. రెడ్డి, పరిపాలనాధికారి శ్రీనివాసరావు, మండల స్వర్ణ గ్రామం అధికారి భానుజి, కార్యదర్శి నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కుడేరు మండలం ఇప్పేరు గ్రామం యం.గోపాల్ రెడ్డి భూ వివాధాం, ఆర్డిఓ, కలెక్టర్ న్యాయం చేయాలని కోరాడు.....



అంకుశం న్యూస్,కుడేరు,నవంబర్ :26 ఎం.గోపాల్ రెడ్డి,కూడేరు మండలము, ఇప్పేరు గ్రామము లో తమ నివాసం కలిగి ఉన్నాడు, ఆ గ్రామంలో యం.గోపాల్ రెడ్డి తండ్రి యం.రామచంద్ర రెడ్డి వీరి భూమి 335 సర్వే నెంబరు.పక్కన గుంట పోరంబోకు భూమి 78 సెంట్లు భూమి ఉంది.పూర్వము బ్రిటిష్ పరిపాలనలో సర్వే చేసినప్పటికీ తీసివేసినారు. అందులో భూమి మా పక్కన సర్వే నెంబరు వాళ్ళు గ్రామానికి చెందిన పి. శ్రీనివాసులు అనే అతను కబ్జా చేసుకొని ఆ భూమిలో చీనీ చేట్లు పంట పెట్టుకున్నాడు. ఎమ్మార్వో వాళ్ళనే తమ వైపు శ్రీనివాసులు మాట వినేలా మాట్లాడుకొని మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారనీ. ఆర్టిఐ, కార్యాలయం,కలెక్టర్ కి,ఆర్డిఓ కి పలుసార్లు అర్జీ ఇచ్చారని చెప్పాడు.వీళ్ళు ఏమి మాకి న్యాయము చేయలేదని చెప్పారు.సర్వే నెంబర్లు అన్నీ చూడండి దొంగవి. ఒకరికే రెండు మూడు సర్వే నెంబర్లు ఉన్నాయి. ఇది తీసేయమని కలెక్టర్ కి ఆర్డీవో కి చెబితే ఎమ్మార్వో తీసేస్తారూ అన్నారు. అదిగో ఇదిగో అని మభ్యపెడుతున్నారు. పంట పోతుంది కాలువ నీళ్లు వచ్చేలా చేయమని అడిగితే నీళ్లు పోకుండా ఇబ్బంది పడుతున్నారనీ గోపాల్ రెడ్డి వ్యక్తం చేశాడు.

జయలక్ష్మి పురం బొమ్మ పరిధిలో ఓటు వేసిన మచ్చా రామలింగారెడ్డి





అంకుశం న్యూస్ రాప్తాడు నవంబర్ 26 అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గం లోని జయ లక్ష్మీపురం బొమ్మపర్తి గ్రామం నందు పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి ఎన్నికల్లోలిఉద్యమ నాయకుడు ఏ.పీ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ట్రస్ట్ చైర్మన్ రాష్ట్ర అధ్యక్షులు వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ మచ్చా రామలింగారెడ్డి తన సొంత గ్రామం జయలక్ష్మిపురం (బొమ్మపర్తి) రాప్తాడు మండలం, నందు ఈరోజు పంచాయతీ ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు ఉదయమే గ్రామానికి వెళ్లి ఓటు వేశారులి ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మచ్చా రామలింగారెడ్డికోరారు

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు





అంకుశం న్యూస్ తిరుమల నవంబర్ 26 ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గురువారం తన సతీమణి శ్రీమతి భువనేశ్వరితో కలిసి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయ మహాద్వారం వద్దకు చేరుకున్నముఖ్యమంత్రివర్యులకు టీటీడీ సాధికారిక మండలి చైర్మన్ మరియు ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, అర్చకులు సంప్రదాయ ఇస్తికఫల్ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఈవో, అదనపు ఈవోలు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఈవోలు డాక్టర్ ఎ. శరత్, శ్రీ ప్రభల గోపీనాథ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సీవీఎస్వో కేవీ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అనాధ ఆశ్రమం లో అన్నదానం చేసిన సికెపల్లి మహిళలు



అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 26 కార్తీక మాసం సందర్భంగా మరియూ ప్రభుత్వ వైద్య శాఖ ఉద్యోగి చిన్న నల్లన్న గారి సుబ్బా రాయుడు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు గురువారం గొట్లూరు అనాధ ఆశ్రమం లో అన్నదానం చేసారు. ఈ సేవా కార్యక్రమం లో గంగమ్మ, గంగాదేవి, అర్జున్ నాగమణి అర్చన,తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వ వైద్య శాఖలో సుబ్బారాయుడు సేవలు మరువలేనిది అన్నారు.

చింతలపల్లి టీడీపీ విజేత పతకమూరు సౌభాగ్య



అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 26 ధర్మ వరం మండలం చింతలపల్లి గ్రామంలో ఎన్డీఏ గవర్నమెంట్ బలపర్చిన ప్రెసిడెంట్ పతకమూరు సౌభాగ్య జె/ా లినాగరాజు భారీ మెజారిటీతో గెలుపొందారు. 500 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.ఆమె గెలుపు పట్ల ధర్మవరం రూరల్ తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు హర్షం ప్రకటించారు

తెలుగు యువత ఘన విజయం



అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 26 ధర్మపురి గ్రామ సర్పంచ్ ఎన్నికైన తెలుగు యువత నాయకులు జి.విజయ్ చౌదరి విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన పరిటాల శ్రీరామ్ కు స్థానిక తెలుగుదేశం నాయకులు కార్యకర్తలకు ధర్మపురి గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారుకాగా విజయ్ చౌదరి గెలుపు పట్ల ధర్మవరం తెలుగు యువత నాయకులు ధర్మవరం తిరుమలేష్ హర్షం ప్రకటించారు. టీడీపీ నాయకులు అభినందనలు తెలియజేసారు

తెలంగాణ ప్రముఖ టీవీ యాంకర్ తీన్మార్ మల్లన్న ను కలిసిన రాష్ట్ర బీసీ మహిళా నాయకురాలు శ్రీమతి సంకారపు జయశ్రీ



అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 26 ప్రముఖ తెలంగాణ టీవీ యాంకర్ తీన్మార్ మల్లన్న ను వారి కార్యాలయం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంఘం మహిళా ప్రెసిడెంట్ శ్రీ మతి సంకారపు జయశ్రీ మర్యాద పూర్వకముగా కలిశారు. టీవీ ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం చూపుతున్న తీన్మార్ మల్లన్న సేవలు మరువలేనిది అని జయశ్రీ ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ మహిళా సంఘం నేత శ్రీ మతి ఎస్. జయశ్రీ తనను తమ కార్యాలయం లో కలిసినందుకు కృతజ్ఞతలు తెలియజేసారు.

సెంట్రల్ యూనివర్సిటీలో ప్రారంభమైన జాతీయ పరిశోధనా పద్ధతుల శిక్షణా శిబిరం

పది రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో 19 రాష్ట్రాల నుంచి పరిశోధకుల భాగస్వామ్యం

బుక్కరాయ సముద్రం అంకుశం న్యూస్ నవంబర్ 26 ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పది రోజుల జాతీయ పరిశోధనా పద్ధతుల శిక్షణా శిబిరం నేడు అనంతపురంలోని జ్ఞాననీమలో ప్రారంభమైంది. ఈ జాతీయ స్థాయి కార్యక్రమంలో 19 రాష్ట్రాలకు చెందిన పరిశోధక విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగం ప్రొఫెసర్ సిజిత్ మిశ్రా మాట్లాడుతూ, విమర్శనాత్మక ఆలోచన, క్రమబద్ధమైన పరిశీలన, ఆధారాలతో కూడిన అవగాహనపై ఆధారపడిన పరిశోధనా సంస్కృతిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఒక పరిశోధక విద్యార్థికి ఉండాల్సిన ఐదు ముఖ్యమైన లక్షణాలను వివరిస్తూ, మంచి పరిశోధన అనేది కేవలం పరిశోధనా పద్ధతులను యాంత్రికంగా అనుసరించడంతో సరిపోదని, భిన్నమైన అభిప్రాయాలను గౌరవించే విశాల దృక్పథం, సమ్మిళిత భావన కూడా కలిగి ఉండాలని పేర్కొన్నారు. సంక్లిష్టమైన సామాజిక వాస్తవాలను లోతుగా అర్థం చేసుకోవడానికి విభిన్న దృక్కోణాలను పరిగణనలోకి తీసుకోవడం ఎంతో ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రారంభ సమావేశానికి అధ్యక్షత వహించిన ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొఫెసర్ సి. శీలా రెడ్డి, ఈ శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్న ఆర్థిక శాస్త్ర విభాగాన్ని అభినందించారు. ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నవారికి స్వాగతం పలుకుతూ, సామాజిక శాస్త్రాల పరిశోధనలో పరిశోధనా పద్ధతులపై పట్టు సాధించడం యొక్క ప్రాధాన్యతను వివరించారు. శిబిరం కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ బ్రజరాజ మిశ్రా, పది రోజుల పాటు నిర్వహించనున్న విద్యా కార్యక్రమాల గురించి వివరించారు. ఇందులో గుణాత్మక, పరిమాణాత్మక పరిశోధనా పద్ధతులు, పరిశోధనా సాధనాలపై ప్రత్యక్ష శిక్షణ, పరిశోధనలో కృత్రిమ మేధ వినియోగం, భారతీయ జ్ఞాన సంప్రదాయాలు తదితర అంశాలు ఉన్నాయి. నిపుణుల ఉపన్యాసాలతో పాటు ఆచరణాత్మక శిక్షణను కూడా అందించే ఈ పది రోజుల కార్యక్రమం ద్వారా పాల్గొనే పరిశోధకులు ఆధునిక పరిశోధనా నైపుణ్యాలను నేర్చుకోవడంతో పాటు తమ పరిశోధనా సామర్థ్యాలను మరింత మెరుగుపరుచుకునే అవకాశం లభించనుంది.

అనంతకలెక్టరేట్ లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

- : కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, డిఆర్ఓ ఏ.మలోల, తదితరులు..





అంకుశం న్యూస్అనంతపురం, నవంబర్ 26 :- అనంతపురం జిల్లాలోనిలిఅనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, డిఆర్ఓ ఏ.మలోల, తదితరులు పాల్గొన్నారు. ఇందులో ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్, డిఆర్ఓ, తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్, డిఆర్ఓ, తదితరులు భారత రాజ్యాంగ పీఠికను పఠించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, కలెక్టరేట్ కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



అంకుశం న్యూస్ ఉరవకొండ నవంబర్ 26 : ఉరవకొండలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను దళిత గిరిజనుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా భారత రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా డిజిహెచ్ఎస్ఎస్ వ్యవస్థాపకులు అధ్యక్షులు మీనుగ.గోపాల్ మాట్లాడుతూ మన రాజ్యాంగం 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ఆమోదించిందన్నారు.అందుకే ఈ రోజును భారత రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. మన దేశాన్ని ప్రజాస్వామ్య గణతంత్రంగా నిలబెట్టిన బలమైన పునాది ఈ రాజ్యాంగమేనాని,ఈ మహా కార్యానికి డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం. భారత ప్రజలకు స్వేచ్ఛ,స్వాతంత్రం,సౌభ్రాతృత్వం,సమాన న్యాయం కల్పించిన ఒక హక్కు అని ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడలలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గుతూరు ఆనందరాజ్,లత్తవరం చంద్రశేఖర్,ఇంద్రావతి మాజీ సర్పంచ్ ఓబులేసు, తిమ్మారెడ్డి, పెద్దముస్టురు రామకృష్ణ,రామలింగ,ఇంద్రావతి సుంకన్న,రాయంపల్లి సోమశేఖర్,ముస్టురు ఆంజనేయులు,విడపనకల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉంగరం గుర్తుకు ఓటు వేయండి

ఓటర్లను అభ్యర్థించిన సర్పంచ్ అభ్యర్థి రాచమల్ల మల్లేష్



బుక్కరాయసముద్రం అంకుశం న్యూస్ నవంబర్ 26 కొర్రపాడు పంచాయతీలోని ప్రజలు ఉంగరం గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను టిడిపి సర్పంచ్ అభ్యర్థి రాచమల్ల మల్లేష్ కోరారు. గురువారం సాయంత్రం కొర్రపాడు నీలారెడ్డిపల్లి రోటరీ పురం గ్రామాల్లోని ప్రజల దగ్గరకు వెళ్లి ఓటు వేయాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. మౌలిక సదుపాయాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాన న్నారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రచార కార్యక్రమంలో గ్రామాల ప్రజలు భ్రమరతం పట్టారు. ప్రతి ప్రతి ఒక్కరు తప్పకుండా ఉంగరం గుర్తుకు ఓటు వేస్తామని అభ్యర్థికి తెలిపారు. రాచమల్ల మల్లేష్ ప్రచారంలో ముందంజలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పర్వత నే శ్రీధర్ బాబు నరేంద్ర యాదవ్ రాజు బలిజ సంఘం సింగనమల నియోజకవర్గం కార్యదర్శి పురుషోత్తం శంకర్ రెడ్డి సోము తదితరులు పాల్గొన్నారు.

వడిశలేరులో కూటమి సర్పంచ్ అభ్యర్థి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే



తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 26: వడిశలేరులో పంచాయతీ ఎన్నికలు సందర్భంగా వడిశలేరు గ్రామ పంచాయతీ కూటమి సర్పంచ్ అభ్యర్థి బిట్రా అశోక్ కుమార్ కి "మంచం" గుర్తుపై మరియు కూటమి బలపరచిన వార్డు మెంబర్స్ అభ్యర్థులకి తమ అమూల్యమైన ఓటును వేసి గెలిపించాలని కోరిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో వడిశలేరు గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

రెండవ సారి విజయం సాధించిన వై సీపీ మహిళా కౌన్సిలర్ శ్రీ మతి కత్తె ఆదిలక్ష్మి



అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 26 ధర్మవరం మున్సిపల్ ఎన్నికలలో రెండవ సారి విజయం సాధించిన వైసిపీ మహిళా కౌన్సిలర్ శ్రీ మతి కత్తె ఆదిలక్ష్మి ని పలువురు కేతిరెడ్డి అభిమానులు గురువారం అభినందించారు. ఈ కార్యక్రమం లో కత్తె పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విజయం సాధించిన కౌన్సిలర్ కత్తె ఆదిలక్ష్మి మాట్లాడుతూ తనను రెండోసారి గెలిపించిన వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసారు

కనగానపల్లి మండలం నరసంపల్లి 7వ వార్డు పోలింగ్ కేంద్రంలో నవంబర్ 27న రీపోల్

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ. శ్యామ్ ప్రసాద్



అంకుశం న్యూస్ పుట్టపర్తి, నవంబర్ 26: శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం నరసంపల్లి గ్రామ పంచాయతీ 7వ వార్డులోని పోలింగ్ కేంద్రం నంబర్-7లో పోలింగ్ సమయంలో బ్యాలెట్ బాక్సులో ఇంకు పోసి, బ్యాలెట్ పత్రాలను ధ్వంసం చేసి పోలింగ్ ప్రక్రియకు అంతరాయం కలిగించిన ఘటన నేపథ్యంలో, సంబంధిత పోలింగ్ కేంద్రంలో నిర్వహించిన పోలింగ్‌ను రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ. శ్యామ్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నవంబర్ 27వ తేదీ (శుక్రవారం) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నరసంపల్లి గ్రామ పంచాయతీ 7వ వార్డు పోలింగ్ కేంద్రం నంబర్-7లో రీపోల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రీపోల్ పూర్తయ్యే వరకు నరసంపల్లి గ్రామ పంచాయతీలోని ఇతర పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపు చేపట్టరాదని ఆదేశించారు. ఇతర పోలింగ్ కేంద్రాల బ్యాలెట్ బాక్సులను భద్రతతో ప్రత్యేక గదిలో ఉంచి, తాళం వేసి సీల్ చేయడంతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పోటీ అభ్యర్థులు తమ ఏజెంట్ల ద్వారా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. రీపోల్ పూర్తయిన అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించడంతో పాటు ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రీపోల్‌ను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఉల్లికల్లు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ఎంచలమయ్య ఉంగరం గుర్తుకు మద్దతుగా టీడీపీ శ్రేణుల జోరుగా ప్రచారం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అదేశాల మేరకు అభ్యర్థికి మద్దతుగా జోరుగా ప్రచారం



శింగనమల అంకుశం న్యూస్ నవంబర్ 26 మండలపరిధిలోని ఉల్లికల్లు గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుతో బరిలో నిలిచిన ఎం చలమయ్య ఉంగరంలి గుర్తుకు మద్దతుగా ఉల్లికల్లు గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లిశింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎం చలమయ్య కి తమ మద్దతు ప్రకటిస్తూ గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎం చలమయ్య ఉంగరం గుర్తుపై ఓటు వేసి లి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఉల్లి కళ్ళు ఉల్లికంటి పల్లి గ్రామంలో మౌలిక సదుపాయాలు , ప్రజల సమస్యల పరిష్కారం, గ్రామ అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగాలని అభ్యర్థి తరపున విజ్ఞప్తి చేశారు.గ్రామ ప్రజలు తమ ఓటు హక్కును ఉంగరం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీ గెలిపించాలని కోరారు ఎన్నికల్లో ఉల్లికల్లు గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి ఎం చలమయ్య ఉంగరంగుర్తుపై ఓటు వేసి తమ మద్దతు తెలియజేయాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు ప్రజలుఎత్తున పాల్గొని జోరుగా ప్రచారం నిర్వహించారు.

రీసర్వే డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ డేటా ఎంట్రీ పనులను సకాలంలో పూర్తి చేయాలి

సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్..

అంకుశం న్యూస్ ఉరవకొండ నవంబర్ 26 : వజ్రకరూరు మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే ప్రక్రియను జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్ తనిఖీ చేశారు.ఇందులో రీసర్వేకు సంబంధించిన డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ డేటా ఎంట్రీ పనులు తహసీల్దార్ లాగిన్ నందు ఏవిధంగా జరుగుతున్నాయో ప్రత్యక్షంగా పరిశీలన చేశారు.అలాగే తహసీల్దార్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, విలేజ్ సర్వేయర్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ల వద్ద డేటా ఎంట్రీ పనులు ఎందుకు ఆలస్యంగా జరుగుతున్నయోనని అడిగి తెలుసుకున్నారు. సకాలంలో రీసర్వే పనులు పూర్తి చేయకపోతే సంబంధించిన వారి మీద శాఖాపరమైన చర్యలు తీసుకొనడం జరుగుతుందని,రీ సర్వేలో ఎటువంటి నిర్లక్ష్యము వహించరాదని జెసి తెలియజేశారు.తహసీల్దార్ కార్యాలయంలో ఒక నెల కాలం నందు వచ్చిన పట్టాదారు పాసుపుస్తకం నమోదు కొరకు వచ్చిన దరఖాస్తులను మరియు దస్త్రాలను పరిశీలన చేయడం మరియు పిజిఆర్ఎస్ నందు వస్తున్న ఫిర్యాదులను ఏ విధంగా పరిష్కరిస్తున్నారు, పరిష్కరించిన దస్త్రాలను పరిశీలన చేయడం జరిగింది. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్,జిల్లా సర్వే మరియు భూ రికార్డుల శాఖ అధికారి కనకారావు,డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే రామాంజనేయులు,మండల తహసీల్దార్ మరియు సర్వేయర్ ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా

మౌలిక సదుపాయాలపై ప్రత్యేక చొరవ

గంప గుర్తుకు ఓటు వేయండి

ఓటర్లను అభ్యర్థించిన సర్పంచ్ అభ్యర్థి హిమబిందు



బుక్కరాయసముద్రం అంకుశం న్యూస్ నవంబర్ 26 బుక్కరాయసముద్రం పంచాయతీలో ఉన్న ప్రజలందరు గంప గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను టిడిపి సర్పంచ్ అభ్యర్థి హిమబిందు కోరారు. గురువారం సాయంత్రం బుక్కరాయసముద్రం పంచాయతీలోని గౌరయ్య కొట్టాలు వీరభద్ర కాలనీ బోయ కాలనీ చేపల వీధి లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటు వేయాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. సర్పంచ్ గా గెలిచిన వెంటనే గ్రామంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేస్తానన్నారు ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాన న్నారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రచార కార్యక్రమంలో అన్ని కాలనీలోని ప్రజలు హిమబిందు కు భ్రమరతం పట్టారు. ప్రతి ప్రతి ఒక్కరు తప్పకుండా గంప గుర్తుకు ఓటు వేస్తామని అభ్యర్థికి తెలిపారు. ప్రచార కార్యక్రమాన్ని రోజురోజుకు హిమబిందు వేగవంతం చేసింది. ప్రజల్లో దూసుకెళ్తోంది. ఎక్కడ చూసినా గంప గుర్తుకు ఓటు వేయాలంటూ ఆటోలలో ప్రచారం ముమ్మురంగా ఉంది. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ టిడిపి మండల కన్వీనర్ అశోక్ కుమార్ ఎస్ నారాయణస్వామి మాజీ ఎంపీపీ ఎస్ కే వెంకటేశులు ఉరిమిండి నారాయణస్వామి చిన్న బాబయ్య వడ్డే నాగభూషణ బండి బాలు శేషయ్య యువకులు తదితరులు పాల్గొన్నారు.